# కామ్రేడ్ కొండపల్లి కోటేశ్వరమ్మకు జోహార్లు

**నిండు** నూరేళ్ళు జీవించిన కామ్రేడ్ కొండపల్లి కోటేశ్వరమ్మ 2018 సెప్టెంబర్ 19న విశాఖపట్నంలో మరణించారు. కమ్యూనిస్టు నిబద్ధతతో కడదాకా జీవించిన కా॥కోటేశ్వరమ్మకు సిపిఐ(ఎం-ఎల్) జోహార్లర్పిస్తున్నది.

కృష్ణాజిల్లా పామర్రులో జన్మించిన కా॥ కోటేశ్వరమ్మ తొలుత జాతీయోద్యమ ప్రభావంతో పెరిగారు. ఊహ తెలియని పసివయసులోనే ఆనాటి ఛాందస భావాలకనుగుణంగా ఆమెకు వివాహం చేశారు. అనతికాలంలో భర్త మరణించటంతో బాలవితంతువుగా చూడబడుతూ ఆమె బాల్యం గడిపారు. తల్లితోపాటుగా కా॥ కోటేశ్వరమ్మ కూడా నాటి జాతీయోద్యమ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

తర్వాతి దశలో కమ్యూనిస్టుపార్టీ ప్రభావంతో-ముఖ్యంగా తొలితరం కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్స్ చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్యల ప్రత్యక్ష పరిచయంతో కమ్యూనిస్టు పార్టీపట్ల ఆకర్షితులయ్యారు. కమ్యూనిస్టు పార్టీ, మహిళాసంఘాల ఆధ్వర్యంలో నాడు సమాజంలో నెలకొన్న ఎన్నో అంధవిశ్వాసాలకు, కులవివక్ష, అంటరానితనాలకు వ్యతిరేకంగా సమిష్టి కార్యక్రమాలలో పాల్గొన్నారు.

జర్మనీ మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ ఎంఎల్‌పిడి ప్రతినిధి బృందం భారతదేశ పర్యటన సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో 2006లో మహిళా సమస్యలపై విజయవాడలో జరిపిన ఇష్టాగోష్టి కార్యక్రమంలో కా॥కోటేశ్వరమ్మ చాలా ఆసక్తిగా పాల్గొన్నారు. ఆధునికానంతరవాదులు అప్పటికే కమ్యూనిస్టు పార్టీపై, పార్టీలో మహిళా కార్యకర్తలపై చేస్తున్న దుష్ప్రచారాలను ఆమె ఈ సందర్భంగా తిప్పికొట్టి, నాటి కమ్యూనిస్టు పార్టీ తొలినాళ్ళనుండే మహిళలపట్ల ప్రత్యేకశ్రద్ధతో తమ అభివృద్ధికి ఎలా దోహదపడిందీ ఎంఎల్‌పిడి కామ్రేడ్స్‌కు సోదాహరణంగా వివరించటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. కా॥కోటేశ్వరమ్మకు సిపిఐ(ఎం-ఎల్) జోహార్లరిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది.

ooooo